COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27`28`12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశం జరిగింది. ప్రచురణార్థం పంపుతున్నాము.**

**-జె.ప్రభాకర్**
**సిపిఐ(యం) ఆఫీసు కార్యదర్శి**

**తేది : 8.3.2018**

# మభ్యపెట్టే బడ్జెట్ ...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మభ్యపెట్టే విధంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. గురువారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా 1.91 లక్షల కోట్ల బడ్జెట్లో 50 వేల కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద చూపించడమే రాష్ట్ర అత్యాశను వెల్లడిస్తోందని తెలిపారు.

2019 మార్చి నాటికి పది లక్షల ఇళ్లను కట్టిస్తామని చెప్పారని, ఇప్పటికి రెండు లక్ష ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయిందని తెలిపారు. ఇంకా ఎనిమిది లక్షల ఇళ్లను కట్టాల్సి ఉందని, దీనికి రూ.24 వేల కోట్ల వరకూ అవసరం ఉంటుందని, బడ్జెట్లో మాత్రం 3679 కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి రూ.4100 కోట్లు కేటాయించడం ఏ మూలకూ చాలవని పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ.2400 కోట్లు రుణమాఫీ బకాయి ఉండగా రూ.1460 కోట్లు వెచ్చించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల ఇళ్లస్థలాల కొనుగోలు, సేకరణకు రూ.4750 కోట్లు అవసరం ఉండగా రూ.575 కోట్లు మాత్రమే కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షేమం పేరు చెబుతూ గత బడ్జెట్ కేటాయింపులకే భారీగా కోత పెట్టారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి కేటాయింపుల్లోనూ కుదింపులు చేశారని పేర్కొన్నారు. వైద్య రంగానికి నిధులను తగ్గించారని పేర్కొన్నారు. గత బడ్జెట్లో కేటాయించిన రంగాలకు నిధులు తగ్గించి మరలా సంక్షేమం గురించి చెప్పడం ప్రజలను మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదని వివరించారు. రాష్ట్రంలో పరిణామాలు వేగంగా మారుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్కు బిజెపి మొండిచేయి చూపించడం పూర్తయిందని బుధవారం నాటితో తేలిపోయిందన్నారు. గతంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు. పోలవరంలో 70 వేల కుటుంబాలకు ముంపునకు గురవుతాయని ప్రకటించారని, వారికి ఇంతవరకు నిధులు కేటాయింపు లేదని పేర్కొన్నారు. అలాగే రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి నిధుల కేటాయింపు లేదని తెలిపారు.

బిజెపి చర్యలను సిపిఎం ఖండిస్తోందన్నారు. అయితే రాష్ట్రానికి అన్యాయం చేశారని, మంత్రివర్గం నుండి బయటకు వచ్చిన టిడిపి ఎన్డిఏలో భాగస్వామిగా ఉంటున్నట్లు ప్రకటించారని, దీనిపై వైఖరి ఏమిటో చెప్పాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఉమ్మడిగా పోరాటం చేయాలని, దీనిపై సిఎం వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని అన్నారు. హోదాపై ఢిల్లీలో జరిగిన పోరుకు మంచి స్పందన వచ్చిందని అన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వమే అఖిలపక్ష సమావేశానికి పిలవాలన్నారు. దీనిపై నాలుగైదు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు.

= = = =